నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు

- ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. ఆదివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 5న రాయచోటి టౌన్‌లో సాయంత్రం ఏడు నుండి, ఎనిమిది గంటల సమయంలో దాదాపు 200 మందితో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం పూజ చేసుకుంటూ, ఠాణా సర్కిల్ వైపు రావడంతో మసీదు దగ్గర కొంతమంది స్లొగన్స్ ఇవ్వడంతో అభ్యంతరం తెలిపారని, అప్పటికే అక్కడ బందోబస్తులో పోలీసులను నియమించామని చెప్పారు. పెద్దలు ఆ ప్రాంతంలో లేక పోవడంతో ముఖ్యంగా కుర్రాళ్ళ స్లోగన్‌లు చేయడం వల్ల ఈ సున్నిత అంశం ఏర్పడిందన్నారు. ఆ రోజు ఇరువర్గాల పెద్దలు రోడ్లమీదకు వచ్చి ఎటువంటి అభ్యంతరాలు చెప్పలేదని, కొందరు ఆకతాయిల వల్ల అత్యుత్సాహంగా,తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారని చెప్పారు. తర్వాత మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధ్యక్షతన పీస్ కమిటీ సమావేశంలో నిర్వహించామని, ఆ కమిటీలో ఇరు వర్గాల పెద్దలతో మాట్లాడడంతో తర్వాత ఒక అవగాహనకు రావడం వచ్చారని ఎస్‌పి వివరించారు. ఈ క్రమంలో సున్నితమైన అంశాన్ని చాలామంది వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా కొందరు ఆకతాయిలు భక్తుల మీద దాడులు దాడి చేసినట్లు, అదేవిధంగా భక్తులు వెళ్తున్న బస్సును మొత్తం పగలగొట్టారని, తప్పుడు కథనాలు వ్యాప్తి చేశారని చెప్పారు. ఇది హైవే రహదారి కావడం అయ్యప్పస్వామి భక్తులు మినీ వ్యాన్‌లో వెళ్తున్న సమయంలో మసీదు దగ్గర ఆగిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యిందని చెప్పారు. మసీదు దగ్గర ఉన్న వారు కొందరు వ్యాన్‌కు దారి ఇస్తూ, తమ పోలీసులకు కూడా ఎంతగానో సహకారం అందించారు చెప్పారు. అయితే కొందరు ఆకతాయిలు బస్సుపై చేతులతో కొట్టడం వల్ల ఒక అద్దం మాత్రం పగిలింది, రాయచోటిలో హిందువులు ముస్లిములు కొట్టుకోలేదని చెప్పారు. ఈ ఘటన పేరు చెప్పి, రాజకీయంగా కానీ, ఇతర ఏ కారణాల వల్ల కానీ మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా కొంతమంది ఆకతాయిలు సోషల్ మీడియా వేదికలలో తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారని, ఇప్పటికే ఇలాంటి వారిని గుర్తించామని, వారి మీద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు సమాచారం ఇచ్చే వారి గురించి ప్రజలకు తెలిస్తే పోలీసు శాఖకు తెలియజేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. సమావేశంలో ఎఎస్‌పి వెంకటాద్రి, రాయచోటి డిఎస్‌పి ఎం.ఆర్. కృష్ణమోహన్, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

135 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రేషన్ బియ్యం దాచించిన ప్రాంతాలను పరిశీలిస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి- కలకడ

135 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టి వేసిన సంఘటన కలకడ, సంబేపల్లి మండల సరిహద్దుల్లో జరిగింది. కలకడ మండలం సమీపంలోని సంబేపల్లి మండలం సోత్రం సోమవారం గ్రామం దేవలంపేట సమీపంలో ఉన్న రెండు చోట్ల సుమారు 135 క్వింటాళ్ల రేషన్ బియ్యం దాచి ఉంచిన విషయాన్ని తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తన సిబ్బందితో వచ్చి దాడులు నిర్వహించినట్లు తెలిపారు.ఈ దాడులలో మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లికి చెందిన కెసి నాగరాజ్‌కు చెందిన షెడ్డును అదే గ్రామానికి చెందిన జోహార్‌కు అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. జోహార్ సుమారు 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దాచి ఉంచినట్లు పేర్కొన్నారు.అదే గ్రామానికి చెందిన మల్లికార్జున భార్య బసమ్మకు చెందిన వేరుశనగ మిషన్‌లో ఎర్రయ్యగారిపల్లికు చెందిన బాలాజీ అనే వ్యక్తి సుమారు 55 క్వింటాళ్ల రేషన్ బియ్యం దాచి ఉంచడం గుర్తించి నట్లు తెలిపారు. రెండు ప్రాంతాల్లో ఉన్న 135 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని జెసి సంబంధిత అధికారులను ఆదేశించడం తెలిపారు. జిల్లాలో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇలాంటి చర్యలకు పాల్గొన్న వారిపై కేసు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లాలో మరో వారం రోజులపాటు పర్యటించి రేషన్ బియ్యం ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌ఒ రఘురాం, తహశీల్దార్ ఫణికుమార్, సిఐ గురునాథ, సంబేపల్లి ఎస్ఐ భక్తవత్సలం, పోలీసులు రమణ నాయక్, ముత్యాలు, విఆర్‌ఒలు, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది, గోడౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేలా ఎదగాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని స్కౌట్ మాస్టర్‌లకు, గైడ్ కెప్టెన్‌లకు నిర్వహించిన బేసిక్, అడ్వా న్సడ్ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్లు స్కౌట్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు.ఆదివారం గాలివీడు రోడ్డు మార్గాన ఉన్న అర్చన కళాశాలలో ఈనెల 2 నుంచి 8 వరకు ఏడు రోజులపాటు నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో బేసిక్ శిక్షణకు 100 మంది, అడ్వాన్సడ్ శిక్షణకు పది మంది స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు హాజర య్యారన్నారు. ఈ శిక్షణలో రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొని పకృతి వైపరీత్యాలు సంభ వించినప్పుడు ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి, పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి అంశాలలో ఏ విధంగా శిక్షణ ఇవ్వాలి, నైతిక విలువలు, మానవతా విలువలు, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవా భావం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్ర మంలో అర్చన కళాశాల కరస్పాండెంట్ పాపిరెడ్డి మదన్ మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ మౌలాలి, కళాశాల డైరెక్టర్ లక్ష్మి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, ట్రెజరర్ మార్ల ఓబుల్‌రెడ్డి, ఎల్‌ఒసిలు జి.వెంకటేశ్వర్లు, శకుంతలమ్మ, శంకరమ్మ, ఎఎల్‌టిలు శివప్రసాద్, నాగరాజగుప్తా, ఫ్రీ ఎల్‌టి నాగరాజ, ఆఫీసు అసిస్టెంట్ చినబాబు, రెండు జిల్లాల స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమానికి హాజరైన స్కౌట్ మాస్టర్లు, కెప్టెన్‌లు

ఎంపీ పిఎ రాఘవరెడ్డికి నోటీసులు జారీ

- నేడు విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

రాఘవరెడ్డికి నోటీసులు అందిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

సోషియల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌ల కేసులో ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి పిఎ బండి రాఘవరెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 9న విచారణకు కావాలని డిఎస్‌పి మురళీనాయక్ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం సాయంత్రం పోలీసులు రాఘవరెడ్డి ఇంటికి వెళ్లి 41-ఎ నోటీసులు అందజేశారు. నోటీసులలో సోమవారం ఉదయం 10 గంటలకు కడప క్రైమ్ బ్రాంచ్ కార్యాలయానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

ఉదయం నుంచి కొనసాగిన హైడ్రామా

ఉదయం నుంచి రాఘవరెడ్డి వర్సెస్ పోలీస్‌లు అన్న రీతిలో హైడ్రామా కొనసాగింది. బండి రాఘవ రెడ్డి ఇంట్లో ఉన్నరనే సమారం అందుకున్న అర్బన్‌ఎస్ఐ విష్ణు నారాయణ, ఐడి పార్టీ పోలీసులు పట్టణంలోని ఆయన ఇంటికి వెళ్లారు. విచారణకు హాజరు కావాలి అని కోరగా 41-ఎ నోటీసులు ఇస్తేనే విచారణకు హాజరు అవుతాను రాఘవరెడ్డి చెప్పారు. గౌరవ హైకోర్టు ఈ నెల 13 వరకు పోలీస్ శాఖ అరెస్ట్ చేయకూడదు అని ఉత్తర్వులు జారీ చేసిందని, కావున విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇస్తేనే హాజరవుతానని పేర్కొన్నారు. దీంతో పోలీసులు చేసేదేమి లేక వెనుదిరిగి వెళ్లిపోయారు. విషయాన్ని ఉన్నత అధికారులకు తెలిపారు.

అజ్ఞాతం వీడిన రాఘవ రెడ్డి

సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులకు సంబంధించి నవంబర్ 8న పులివెందుల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముద్దాయి అయిన వర్రా రవీంద్ర రెడ్డిని అరెస్ట్ చేసి విచారించారు. విచారణలో వర్రా ఇచ్చిన వాంగ్మూలంలో ఎంపీ పిఎ రాఘవరెడ్డి సూచనలతోనే పోస్ట్ పెట్టేవాడిని అని చెప్పడంతో ఆయన పేరును కేసులో నమోదు చేశారు. పోలీసులు తనను అరెస్టు చేస్తారని ముందుగా సమాచారం తెలుసుకుని గత నెల 10 నుంచి రాఘవ రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లారు. పోలీస్ శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి జల్లెడ పట్టి వెతికినా అదుపులోకి తీసుకోలేక పోయారు. రాఘవ రెడ్డి ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కడప కోర్టులో పిటిషన్ వేయగా కోర్టు తిరస్కరించడంతో హై కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈనెల 13 వరకు పోలీసులు రాఘవరెడ్డిపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని అని మధ్యంతర ఉత్తర్వు లలు జారీ చేయడంతో దాదాపు నెల రోజుల పాటు అజ్ఞాతంలో ఉన్న రాఘవ రెడ్డి మొదటి సారి ఆదివారం పులివెందులలోని తన ఇంటికి రాడంతో అతన్ని కలిసేందుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా వచ్చారు.

'సీమ' ఖ్యాతిని చాటేలా మహాసభలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం మహాసభలకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని ఆదివారం సిపి బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించారు. వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి 8 ,9 తేదీలలో జిల్లా రచయితల సంఘం మహా సభలు రాయలసీమ సాంస్కృతిక, సాహిత్య ఖ్యాతిని చాటేలా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జున రెడ్డి, పూర్వ అధికార భాషా సంఘం అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్‌ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మహాసభల్లో రాయలసీమ సాహిత్య అధ్యయనంపై సదస్సులు, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా ఈ మహాసభలలో యువతకు, విద్యార్థులకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. సదస్సులకు శలాక రఘునాధ శర్మ, కొలకలూరి ఇనాక్, బేతవోలు రామబ్రహ్మం, కసిరెడ్డి వెంకటరెడ్డి, కాత్యాయని విద్మహే లాంటి ప్రముఖ సాహితీ వేత్తలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహాసభల విధివిధానాలను తెలియజేశారు. సమావేశంలో జిల్లా రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు షేక్. హుస్సేన్ సత్యాగ్ని, సంయుక్త కార్యదర్శులు డా భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డా. పొదిలి నాగరాజు, భూమిరెడ్డి స్వరూప రాణి, కోశాధికారి డా. రెడ్డి శేఖర్ రెడ్డి,సభ్యులు డా.జి.వి.సాయి ప్రసాద్,డా. వెల్లాల వెంకటేశ్వర చారి, డా. తవ్వా వెంకటయ్య , డా.అనుగూరు చంద్రశేఖర్ రెడ్డి, డా. పెద్దిరెడ్డి నీలవేణి, పాల్గొన్నారు. అనంతరం జిల్లా రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు షేక్. హుస్సేన్ సత్యాగ్ని దంపతులను ఘనంగా సత్కరించారు.

ప్రతి ఒక్కరికీ గూడు కల్పిస్తాం

గృహ నిర్మాణ శాఖ పీడీ శివయ్య

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ప్రజలకు, లబ్ధిదారులకు అందరికీ అందుబాటులో ఉంటూ గూడు కల్పిస్తాం. ఇల్లు నిర్మించిన వారందరికీ వారి ఖాతాల్లో ఇప్పటికే డబ్బులు చెల్లించాం. జిల్లాలో గూడు లేని వారు ఉండకూడదనే తమ లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ పీడీ ఎస్. వి. శివయ్య పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో లబ్ధిదారులకు గృహ నిర్మాణం, బిల్లులు ఏ విధంగా ఇవ్వాలో, జిల్లాలో గృహ నిర్మాణ శాఖ ద్వారా జరిగిన, జరగబోయే పనులు గురించి ఆయన ప్రజాశక్తి ఇచ్చిన ముఖాముఖిలో వివరించారు.

జిల్లాల గృహ నిర్మాణ శాఖ కార్యాలయాల వివరాలు తెలియజేయండి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా రాయచోటి రాజంపేట, మదనపల్లె డివిజన్లలో గృహ నిర్మాణశాఖ కార్యాలయాలున్నాయి. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, తంబలపల్లె ప్రాంతాల్లో డిఇలున్నారు. మండలానికి ఒక్కొకరు చొప్పున 30 మండలాలకు ఎఇలు, 22 మంది వర్క్ఇన్‌స్పెక్టర్లు జిల్లా వ్యాప్తంగా ఉన్నారు.

జిల్లాలో ఐదేళ్ల కాలంలో ఎన్ని గృహాలు మంజూరు అయ్యాయి? ఎన్ని పూర్తయినాయి?

జిల్లా వ్యాప్తంగా ఐదేళ్ల నుంచి ఇప్పటివరకు 79,721 గృహాలు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 36, 974 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన 34, 083 గృహాలు వివిధ దశలలో ఉన్నాయి. ఇప్పటివరకు మొదలు పెట్టనవి 12,946 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రూ. 858 కోట్లు చెల్లించాం.

లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి ఎలా అందిస్తారు?

లబ్ధిదారులకు కేటాయించిన గృహాలు పూర్తి చేసిన వారం రోజుల్లో ప్రభుత్వం నుంచి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో చెల్లించడం జరుగుతుంది. గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలి.

కొత్తగా గృహాలు మంజూరు కావాలంటే లబ్ధిదారులకు ఎలాంటి అర్హతలుండాలి?

లబ్ధిదారులు అదే గ్రామంలో నివాసం ఉంటూ, భార్యాభర్తలు ఆధార్‌కార్డులు, రేషన్ కార్డు ఉండాలి. ఇంకా బ్యాంక్, ఫోన్ నెంబర్ లింకు ఉన్నటువంటి అకౌంట్లు, ఆదాయ ధృవీకరణ పత్రం, పానుకార్డు, లబ్ధిదారుల సంతకం, ఫోన్ నంబర్ తదితర పత్రాలను దరఖాస్తుతోపాటు జత చేసి గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో అందజేయాలి.

జిల్లాలో గతంలో ఎన్ని లే అవుట్లు ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 342 లే అవుట్లు, కాలనీ లున్నాయి. ఇప్పటికే చాలా లే అవుట్లలో గృహాలు నిర్మించుకుని నివాసముటున్నారు. ఇంకా కొన్ని కాలనీల్లో వివిధ దశలలో గృహ నిర్మాణాలు జరుగు తున్నాయి.

నూతన గృహాలకు కోసం సంబంధించిన లబ్ధిదారులు ఎక్కడ సంప్రదించాలి?

నూతన గృహాల కోసం దగ్గర్లో ఉన్న గ్రామ సచివాలయం, లేదా మండల గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో పైన తెలిపిన పత్రాలు తీసుకొని సంబంధింత అధికారులకు సంతకం చేసి ఇవ్వాలి. గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఆఫీసులో కానీ, సంబ ంధిత సచివాలయంలో కానీ మాత్రమే నివాస గృహం కోసం దరఖాస్తు చేసు కోవాలి. ఎవరికి డబ్బులు ఇవ్వవలసిన అవసరం లేదు. అట్లు ఎవరైనా డబ్బులు అడిగితే వారు నివసిస్తున్న నియోజకవర్గం ఎమ్మెల్యేకు కానీ, అధికారులకు కానీ ఫిర్యాదు చేయాలి.

విశిష్ట సేవకులకు ఘన సన్మానం

వివిధ రంగాల్లో సేవలందించిన వారిని సన్మానించిన సీనియర్ సిటిజన్స్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన విశిష్ట సేవకులకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మదనపల్లి వారు ఘనంగా సత్కరించారు.ఆదివారం పట్టణంలోని జిఆర్‌టి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.ముని గోపాలకృష్ణ అధ్యక్షతన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ ఉస్మాన్‌సాహెబ్, గౌరవాధ్యక్షులు ముని రత్నమయ్య, గౌరవ సలహాదారులు ప్రొఫెసర్ శ్రీనివాసులు, డాక్టర్ గొల్లపూడి తిరుమలరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్.మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి అసోసియేషన్ నిర్విరామంగా కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా గౌరవాధ్యక్షులైన మునిరత్నమయ్య డాక్టరేట్ అందుకోవడం, రాయల్ యూత్ సొసైటీ వ్యవస్థాపకులు రేగడి ప్రసాద్ కుమార్ వినియోగదారుల ఫోరం డైరెక్టరుగా జిల్లా కలెక్టర్ నియమించిన శుభ సందర్భంలో వారిని సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. వారు భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. మునీ రమ్మ తాను ఎదుర్కొంటున్న సమస్యలను అసోసియేషన్ దృష్టికి తీసుకురాగా సీనియర్ సిటిజన్ల తరపున కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిపెన్షనర్స్ నాయ కులు శ్రీనివాసులు, తిమ్మయ్య, ధనలక్ష్మి, సరస్వతి, రామచంద్రయ్య,రచయిత టిఎస్ఎ కృష్ణమూర్తి, నాగరాజు, జగన్మోహన్, నిర్వాహకులు,కృష్ణమూర్తి, జంగాల వెంకట రమణ, రైస్ మిల్ శశి కుమార్, మేస్త్రి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : అంగన్వాడీలకు వెంటనే వేతనాలు ఇవ్వాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. రాజేశ్వరి డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు ఇస్తామన్న పాలకులు హామీని అమలు చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. అంగన్వాడీల చేత గొడ్డు చాకిరీ చేపించుకునే ప్రభు త్వాలు వారికి ఇచ్చే వేతనాలు ఏ మూలకు సరిపోవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చే అరకొర వేతనం కూడా ప్రతి నెలా చెల్లించక పోతే ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. నిత్యవసర వస్తు వుల ధరలు విపరీతంగా పెరిగిపోయి కుటుంబ పోషణ భారంగా మారిందని అన్నారు. కూరగాయలు, గ్యాస్ బిల్లులు కూడా చెల్లించనందున అంగన్వాడీలపై మరింత భారం పడుతుందని ఆవేదన చెందారు. ప్రభుత్వం వేంటనే స్పందించి వేతనాలు, కూరగాయలు, గ్యాస్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయండి : సిఐటియు

రాయచోటి టౌన్ : అంగన్వాడీ పోస్టులను పారదర్శంగా భర్తీ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ చిత్రపటం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంగన్వాడీ లతో కలిసి మాట్లాడారు. ప్రాజెక్ట్ పరిధిలో హెల్పర్లు, వర్కర్లు, మినీ వర్కర్ల పోస్టుల భర్తీలో పారదర్శకత పాటించకుండా అధికారులు లోపాయికారి ఒప్పందంతో ఖాళీ చూపించకుండా నోటిఫికేషన్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని అవినీతి అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి డి. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల వర్కర్లపై పని భారం తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. అనారోగ్య పాలవుతున్నారని తెలిపారు. జీతాలు సకాలంలో రాలేదని, సెంటర్ అద్దెలు 8 నెలలుగా రాకపోవడంతో ఓనర్లతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబేపల్లి మండలం శెట్టిపల్లి సెక్టార్ దిగువరాజుగారిపల్లి హెల్పర్ రెండేళ్లుగా విధుల్లో లేరని, వెంటనే హెల్పర్‌ను నియమించి వర్కర్‌కు పనిభారం నుండి ఉపశమనం కలిగించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వి. సిద్ధమ్మ ఉపాధ్యక్షులు అనుసూయమ్మ అరుణ సుమలత లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఆచార్య ఈశ్వర్‌రెడ్డికి పురస్కారం హర్షణీయం

- పురస్కార ప్రదానోత్సవ సభలో వక్తలు

ప్రజాశక్తి - కడప అర్బన్

సామాజిక బాధ్యతతో రచనలు చేస్తున్న ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డికి తుమ్మల సాహిత్య పురస్కారం అందించడం చాలా సంతోషంగా ఉందని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. గుంటూరులో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డికి తుమ్మల వెంకటరామయ్య పురస్కారం -2024 ను అందజేశారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటులో తుమ్మల వెంకట్రామయ్య నిర్మాణాత్మక పాత్ర పోషించారని, పీడితుల పక్షాన నిలబడి పీడకులను ప్రశ్నించారని, అలాంటి రచయిత పేరుమీద ఏర్పాటుచేసిన ప్రతిష్టాత్మక సాహితీ పురస్కారాన్ని ప్రజాపక్షం వహించి రచనలు చేస్తున్న ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డికి ఇవ్వడం సంచితంగా ఉందని పేర్కొన్నారు. ఆచార్య ఎన్.ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గురజాడ ప్రారంభించిన మాత్రాఛందస్సులను ఆ తదనంతర కాలంలో చాలామంది కవులు అందిపుచ్చుకున్నారని అన్నారు. అభ్యుదయ గేయాలు ప్రజలకు చైతన్య వీచికలుగా నిలుస్తూ అజరామరంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమానికి ప్రముఖ నాటక రచయిత అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, విశాలాంధ్ర జనరల్ మేనేజర్ మనోహర్, అభ్యుదయ రచయితలు కె.శరత్, బూర్ల రవి, కోసూరి హాజరయ్యారు.

కడప 'ఉక్కు'పై రాజకీయ పార్టీల వైఖరి తెలపాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు : కడప ఉక్కుపై రాజకీయ పార్టీల స్పష్టమైన వైఖరి తెలపాలని, ప్రజా ఉద్యమాలకు కలసి రావాలని అవసరమైతే పార్లమెంటు సమావేశాలలో ఎపి ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి చేసి అవసరమైతే పోరాటాలు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. ఆదివారం పట్టణంలోని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె మస్తాన్ షరీఫ్, ఎస్.కె ఆదిల్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ కడప ఉక్కు పైన కేంద్రం వైఖరి మారాలని అన్నారు. పార్లమెంటులో ఆ ప్రస్తావనే తమ వద్ద లేదని తెలపడం జిల్లా ప్రజలను కలిచివేసిందన్నారు. కడప ఉక్కు విభజన చట్టంలో చట్టబద్ధంగా రాసుకున్న వాటి అమలుకు కేంద్రం ముందుకు అడుగులు పడటం లేదన్నారు. వలసలు, కరువుతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంతంలో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అయితే లక్షలాదిమంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. కానీ కేంద్రంలోని బిజెపి కడప ఉక్కు పైన పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. పార్లమెంటులో రాష్ట్రంలోని అధికార,ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నోరెత్తక పోవడం భాదాకరమన్నారు. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్షాల ఎంపీలు కడప ఉక్కు పైన తమ వైఖరి ప్రజలకు తెలపాలన్నారు. కడప ఉక్కు పరిశ్రమ కోసం డివైఎఫ్ఐ యువజన సంఘం భవిష్యత్‌లో పెద్ద ఎత్తున అన్ని రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను, మేధావులను విద్యార్థి, యువకులను కలుపుకొని పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

'మిట్స్' వైస్ ప్రిన్సిపల్‌కు లీడర్ షిప్ అవార్డు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపం లోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్. పి. రామనాథన్‌కు చెన్నైలోని ఇన్‌స్పైర్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ వారు ఎక్సలెన్స్ ఇన్ లీడర్‌షిప్ అవార్డును అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, మెడికల్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ సైన్స్‌పై రెండవ అంతర్జాతీయ కాన్ఫరెన్స్, అవార్డుల కార్యక్రమంలో ఈ అవార్డును అందజేసినట్లు ఆయన అన్నారు. అకడమిక్స్‌లో వైస్ ప్రిన్సిపల్ కృషికిగాను ఈ అవార్డును అందించారని చెప్పారు. అవార్డు పొందిన పి.రామనాథన్‌ను కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

శాశ్వత డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట డివిజన్ పరిధిలోని 9 మండలాలలో 104 చౌక దుకాణాలకు శాశ్వత డీలర్లకు నియామక ప్రక్రియ చేపడుతున్నట్లుగా రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజంపేట డివిజన్ పరిధిలోని వివిధ మండలాలైన చిట్వేలి మండలంలో 1, నందలూరు 11, ఓబులవారిపల్లి 15, పెనగలూరు 6, పుల్లంపేట 7, రాజంపేట 21, రైల్వే కోడూరు 16, సుండుపల్లి 13, వీరబల్లిలో 14 చౌక దుకాణాలకు శాశ్వత డీలర్లకు నియామక ప్రక్రియ చేపడుతున్నట్లుగా ఆమె తెలిపారు. 18 సంవత్సరాలు నిండి 40 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి ఉన్న అభ్యర్థులు సంబంధిత తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు ఫారంను తీసుకొని 14లోగా సంబంధిత తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తును సమర్పించాలన్నారు.

వృధాగా పోతున్న తాగునీరు

దెబ్బతిన్న పైప్‌లైన్.. తాగునీరు వృథా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లెలో ప్రధానంగా ఉన్న పైప్‌లైన్ దెబ్బతిని తాగునీరు వృథాగా పోయి నీరు కలుషితమవుతుంది. బిఎస్ఎన్ఎల్ సిబ్బంది యంత్రాలతో చేస్తున్న పనుల్లో ఎంపిడిఒ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న పొలాల్లో ఉన్న పలసుతోపు నుంచి వస్తున్న మంచి నీటి పైప్ లైన్ దెబ్బతిని నీరు వృథా పోతుండటంతో పలు వీధుల్లో మంచినీటి సమస్య ఏర్పడింది. పైప్‌లైన్‌కు ఒకసారి జాయింట్ వేయాలంటే రూ.30వేలు ఖర్చు అవుతుందని పంచాయతీ అధికారులు తెలిపారు.

తాగునీటి బోరు వేయిస్తున్న టిడిపి నాయకులు

బిసి కాలనీలో నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బిసి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కారానికి మంత్రి ఆదేశాల మేరకు టిడిపి గ్రామ నాయకులు దేరంగుల శ్రీనివాసులు సొంత నిధులతో తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఆదివారం బోరు వేయించడంతో మూడు ఇంచుల్లో గ్రామ స్తులు సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తాగునీటి సమస్యను తీసుకుపోయి వెంటనే గ్రామ నాయకులకు బోరు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించి దాహార్తిని తీర్చారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి గాలివీడు సురేంద్రనాథ్‌రెడ్డి, అంజనారెడ్డి, అయోధ్య పురం పట్టాభి రెడ్డి, శివారెడ్డి, ఆర్‌ఎంపి శ్రీనివాసులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

మహిళా సభ్యులకు చిరుధాన్యాలు పంపిణీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల మొగ్గుచూపి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రకృతి వ్యవసాయాన్ని అమలు పరుచుకోవాలని ఎపి సి ఎన్ఎఫ్ జూనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ పవన్, ఎన్ ఎఫ్ఎ సునీత సూచించారు. ఎర్ర సానిపల్లెలో అర్బన్ఐవిఎస్, ఎపి సిఎంఎఫ్ ఆధ్వర్యంలో భాగంగా ఆరోగ్య పోషణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిం చిన చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, ఫుల్ బాస్కెట్‌ను గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలు, 72 నిరుపేద మహిళా సంఘ సభ్యుల కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబం రసాయన రహిత ఉత్పత్తులను ఆహా రంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపి సిఎంఎఫ్ సిబ్బంది సునీత, పద్మా వతి, రాజు, రఘునాథ్, నిజాం, సుజాత, కూటమి నాయకులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి కండువా వేసి పార్టీలో ఆహ్వానిస్తున్న జయచంద్రారెడ్డి

టిడిపిలో చేరిన సర్పంచ్ సంధ్యా జనార్దన్‌రెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు మండలం, నాయనిచెరువుపల్లె సర్పంచ్ సంధ్యాజనార్దన్ రెడ్డి ఆదివారం వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఆదివారం తంబళ్లపల్లి టిడిపి ఇన్‌ఛార్జ్ జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ సంధ్యా జనార్దన్ రెడ్డి టిడిపి కండువా వేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లా డుతూ గ్రామాల అభివృద్ధి కోసం వైసిపి నుంచి టిడిపిలో చేరినట్లు తెలిపారు. త్వరలో మరి కొంతమంది పార్టీ మారుతున్నట్లు జయచంద్రారెడ్డి తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ అరుణ చంద్ర, గుండాల శంకరప్ప, రామంజి, విశ్వనాథ్, టిడిపి నాయకులు బీసీ రమణ, సురేష్ పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం : రైతుకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గడ్డివాము దగ్ధమై రైతుకు తీవ్రనష్టం వాటిల్లిన సంఘటన నిమ్మనపల్లి మండలంలో జరిగింది. కొండయ్యగారిపల్లె పంచాయతీ వికెజోజిగారిపల్లెకు చెందిన తోట నాగరాజు తన ఇంటి వద్ద పశువుల కోసమై వరి గడ్డిని వామిగా వేసి ఉంచారు. ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు గడ్డివామికి నిప్పు అంటుకొని మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే మంటలను అదుపులోకి తేవడానికి తీవ్రంగా శ్రమించిన అతి కష్టం మీద మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే గడ్డివాము కాలిపో యింది. సుమారు మూడు ట్రాక్టర్ లోడు కలిగిన గడ్డివాము కాలిపోవడంతో రైతు కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుతం వేసవి సమీపి స్తుండటంతో పశువులకు గ్రాసం కాలిపోవడంతో, తమకు పశుగ్రాసం కొరత ఏర్పడిం దన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

కాలిపోతున్న గడ్డివాము మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తున్న ప్రజలు

దుర్గంధభరితంగా కలకడ టమోటా మార్కెట్

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలో ఉన్న టమోటా మార్కెట్ దుర్గంధభరితంగా మారి రోగాలకు నిలయంగా మారిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కలకడ గుర్రంకొండ రోడ్డు మార్గంలో ఉన్న టమోటా మార్కెట్ చిన్నపాటి వర్షానికే బురదమైనంగా మారి చెరువును తలపిస్తోందని వ్యాపారస్తులు, రైతులు పేర్కొంటున్నారు. కలకడ పంచాయతీ వారు వేలం పాటల ద్వారా లక్షలకు లక్షలు తీసుకొని టమోటా మార్కెట్‌ను ఏమాత్రం పట్టించుకోకపోవడం సరికాదని అంటున్నారు. మార్కెట్ లోపలికి రైతులు, వ్యాపారస్తులు వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లవలసిన దుస్థితి ఏర్పడు తున్నట్లు వాపోతున్నారు. ఇక టమోటా మండి యజమానులైతే వారి మండల సమీపంలో ఎర్రమట్టిని సొంత నిధులతో తోలుకొని శుభ్రం చేసుకున్నప్పటికీ వర్షం పడిన వెంటనే మట్టి పూర్తిగా కొట్టుకుపోయి మరల బురదమయంగా మారి దుర్వాసన వెదజల్లుతోందని అన్నారు. టమోటాల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు సైతం బురదలోనే వెళ్లవలసిన దుస్థితి ఏర్పడిందని చెబుతు

బురదమయంగా మారిన టమోటా మార్కెట్

న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పంచాయతీ సిబ్బంది స్పందించి టమాట మార్కెట్‌లో బురద మయమైన మార్కెట్ శుభ్రం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు.

కురబల అభ్యున్నతికి డైరెక్టర్లు కృషి చేయాలి

కురబ కార్పొరేషన్‌కు ఎన్నికైన డైరెక్టర్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురబల అభ్యున్నతికి డైరెక్టర్లు కృషి చేయాలని కురబ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లెరెడ్డిప్రసాద్ పిలుపునిచ్చారు. ఎపి కురబ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాల నుంచి వల్లిగట్ల వెంకటరమణ, రాజగోపాల్, ఉయ్యాల రమణ, సుబ్ర హ్మణ్యం గౌడలు ఎంపిక కావడం శుభపరిణామమని బెల్లెరెడ్డి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. నూతన డైరెక్టర్లను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కురబల ప్రాబల్యాన్ని గుర్తించి సిఎం చంద్రబాబు నాయుడు కురవ కార్పొరేషన్‌లో నలుగురికి డైరెక్టర్లుగా చోటుకల్పించడం జరిగిందన్నారు. కురబలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశమేనని స్పష్టం చేశారు. నూతన డైరెక్టర్లు కురబల సంక్షేమానికి కృషి చేయాలని, కార్పొరేషన్ ద్వారా అర్హులైన కురువలకు విరివిగా రుణాలు అందేలా చూడాలని ఆకాంక్షించారు. కురబలకు అధిక ప్రాధాన్యతనిస్తున్న టిడిపికి మనమంతా రుణపడి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కురబ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల జిసిటిఎ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం అన్నమయ్య జిల్లా ఎన్నికలు ఆదివారం ఉదయం 9.30 గంటలకు జిసిటిఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మలిగి రాఘవరెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనరల్ సెక్రటరీ జి.వెంకటకృష్ణయ్య, రిటర్నింగ్ అధికారి డాక్టర్ డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో కలికిరిలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళా శాలలో జరిగాయి. జిల్లా పరిధిలోని బి.టి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మదనపల్లి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎన్‌టిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వాయల్పాడు, సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల, కలికిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాయచోటి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, రాయచోటిల నుంచి యూనిట్ స్థాయి ఆఫీస్ బేరర్లు, ప్రాథమిక సభ్యులు అందరూ ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ ఎన్నికలలో జిల్లా ప్రెసిడెంట్‌గా జె. మోహ వల్లి, జి. డిసి ఉమేన్స్, మదనపల్లి, సెక్రటరీగా డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి, ఎస్‌జి.ప్రభుత్వ

డిసిడిసిటిఎ ఏకగ్రీవ ఎన్నికైన అభ్యర్థులు

డిగ్రీ కళాశాల, పీలేరు, ఉమెన్ సెక్రటరీగా డాక్టర్ ఎస్.గులాబ్‌జాన్, ఎస్‌డబ్ల్యూఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కలికిరి ట్రెజరర్‌గా బి.కిరణ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు.

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలి

మాట్లాడుతున్న కుతుబుద్దిన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రక్షించుకునేందుకు వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలని టిఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం వక్ఫ్ సవరణ బిల్లు-2024 తిరస్కారం, స్థానిక సమస్యల గురించి చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ గెజిట్లో చూపబడిన ఆస్తులు అనేకచోట్ల వక్ఫ్ బోర్డు ఆధీనంలో లేవన్నారు. దేశం మొత్తం మీద 70 శాతం ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. కొన్నిచోట్ల ప్రభుత్వాలే తమ అవసరాల కోసం వక్ఫ్ ఆస్తులను వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు చుట్టుపక్కల వక్ఫ్‌కు చెందిన ఐదు ప్రదేశాలలోని ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని వివరించారు. మోడంపల్లె మసీదు, జామియా మసీదు, నజరుల సాహెబ్ ఆస్తి షా హుస్సేన్ వలి సాహెబ్, మహ బూబ్ సుభాని దర్గా ఆస్తులు 80 శాతం అన్యాక్రాంతమయ్యాయని వివ రించారు. చుట్టుపక్కల గ్రామాలైన తాళ్లమాపురం, కల్లూరు, ఉప్పరపల్లె, పల్ల వోలు, చీపాడు, చిన్న గురువలూరు, పెద్ద గురువలూరు, బూడిదపాడు, పొట్టిపాడు, కామనూరు, హనుమన గుత్తి తదితర చోట్ల వందశాతం అన్యాక్రాంతమయ్యాయని వాపోయారు. ఇక పార్నపల్లెలో అయితే వందల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డుకు జ్యుడి షియల్ అధికారాలు లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. వక్ఫ్‌కు సంబంధించిన కేసులు ప్రొద్దుటూరు కోర్టులో 2000 సంవత్సరం నుండి ఇప్పటికీ తేలక పోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇంకా ఈ సవరణలు తెస్తే వక్ఫ్ బోర్డులు పూర్తిగా నిర్వీర్యమై పోతాయన్నారు. ముస్లింలు ప్రతి చోట వక్ఫ్ పరి రక్షణ కమిటీలుగా ఏర్పడి ఆస్తులను కాపాడాలన్నారు. ఆదాయం సమకూర్చి పేద ముస్లింల విద్య, వైద్యం, సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. ఇందుకు తమ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇర్ఫాన్‌బాషా, కమల్ సాహెబ్, ఫరీద్, ఖాజా మొహిద్దీన్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు మట్టిముంత ఇచ్చి వారి నుండి వెండి చెంబు దొంగిలించినట్లుందని కూటమి పాలన అని విమర్శించారు. చంద్రబాబు పాలన ఇచ్చేది గోరంత.. లాక్కునేది కొండంత అన్నట్లు ఉందన్నారు. ఉచిత గ్యాస్ పథకం కింద ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్నది ఏడాదికి రూ.2,694కోట్లు కాగా, కరెంటు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజల నుంచి లాక్కుంటున్నది అక్షరాల రూ.15,485 కోట్లు అన్నారు. ఉచిత గ్యాస్ పథకం కూడా పాక్షికంగానే అమలవుతోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో చాలావరకు అమలు కావడం లేదన్నారు. నిరుద్యోగ భృతి అతీగతి లేదన్నారు. మహిళలకు, మగవాళ్లకు, ఆఖరుకు హిజ్రాలకు కూడా రక్షణ కరువైందన్నారు. రాష్ట్ర ప్రగతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తులసిరెడ్డి అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పూల నజీర్ అహ్మద్, సీనియర్ నాయకులు బ్రహ్మానంద రెడ్డి, జిల్లాని బాషా, రషీద్, ఖాజా, అలీ షాహిద్, అమర్, ఉత్తన్న, ఐచర్ రమణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధ్రువకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లికి వందనం నిల్.. తండ్రికి ఇంధనం ఫుల్ అంటూ కూటమి ప్రభుత్వ తీరును విమర్శించారు. కూటమి ప్రభుత్వం పెట్టిన సూపర్ 6 పథకాలు అట్టర్‌ప్లాప్ అయ్యాయన్నారు. మండలానికి 4 మద్యం షాపులు, 40 బెల్టు షాపులు అన్నవిధంగా మద్యం పాలసీ తయారైం దన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యా ంగం నడుస్తూనే ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చేలా పాలన సాగించాలని ఆయన కోరారు.

ప్రతి పల్లెకూ త్రీఫేస్ కరెంట్ : ఎఇ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆర్‌డిఎస్ఎస్ స్కీంలో భాగంగా ప్రతి పల్లెకు త్రీఫేస్ కరెంటు రాబోతుందని, కొన్ని సబ్‌స్టేషన్ పరిధిలో పనులు జరిగాయని, మరి కొన్ని జరుగుతున్నాయని విద్యుత్ ఎఇ ప్రియదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లా డుతూ వ్యవసాయానికి ఉదయం ఏడు నుంచి సాయంత్రం నాలుగు వరకు ఉచిత కరెంటు ఇస్తున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్లు బిగింపు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. తొలుత కమర్షియల్‌గా ఉపయోగించుకునే వారికి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. అదానీ సంస్థ ఈ కాంట్రాక్టు చేస్తున్నారని వివరించారు. కొన్నాళ్ల పాటు ఎప్పటిలాగే బిల్లులు వస్తాయని తెలిపారు. తర్వాత చిప్ ద్వారా డబ్బులు కట్టే విధంగా వస్తాయని వివరించారు. పట్టణంలో12 ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరగకుండా చుట్టూ ఫెన్సింగ్ వేయించామన్నారు.

వెంకట్‌ను ప్రచారకర్తగా నియమించాలి

పజాశక్తి - ప్రొద్దుటూరు

పుట్టుకతో వైకల్యంతో జన్మించి తల్లిదండ్రుల కృషి, పట్టుదలతో అత్యంత ప్రతిభావంతుడిగా తయారైన వెంకట్‌ను రాష్ట్ర ప్రభుత్వం 'ప్రచారకర్త'గా నియ మించాలని, ప్రతిభకు పట్టం కట్టాలని వెంకట్ తల్లిదండ్రులు విశాలాక్షి, రాధా కృష్ణ కోరారు. ఆ మేరకు వారు ముఖ్యమంత్రి చంద్రబాబును తాడేపల్లిలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో భవిత కేంద్రాల్లో మోటివేషన్ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ప్రేరణ, పట్టుదలను పెంపొం దించేందుకు దోహదపడ్తారన్నారు. ఇందుకు చంద్రబాబు సాను కూలంగా స్పందించారని తల్లిదండ్రులు తెలిపారు.

ఆగిన బాలికల పాఠశాల నిర్మాణ పనులు

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరులోని నంద్యాల రోడ్డు ఆనకుంటలో రూ.1.44 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు ఏడాది నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. నాలుగు వందల మంది బాలికలు ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రత్యేక గదులు లేకపోవడంతో బాలుర పాఠశాల ఆవరణలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో విడత కింద 12 గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ప్రారంభంలో పనులు వేగంగా జరిగి.. రెండు అంతస్థులకు సంబంధించి స్లాబ్ కూడా పూర్తి చేశారు. తర్వాత పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అనంతరం ఎన్నికలు రావడం ప్రభుత్వం మార్పుతో ఈ పాఠశాలను గాలికి వదిలేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, విద్యాశాఖ అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో నూతన భవనాల్లోకి బాలికలు మారేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ట్రిపుల్‌ఐటిలో నేడు రక్తదానం

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో ఉన్న మల్లెలమ్మ తల్లి 13వ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు పలు కార్యక్ర మాలతోపాటు ఆలయ ప్రాంగణంలో కడప రిమ్స్, కాలేజీ యాజమాన్యం సహాయ సహకారాలతో రక్తదానం శిబిరం నిర్వహిం చనున్నారు. ఆయా కార్యక్ర మాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. రక్తదానం చేయదలచిన వారు 81064 73271 నెంబర్‌ను సంప్రదించాలని సూచిం చారు. సాయంత్రం 5 గంటల నుండి ఆర్కే వ్యాలీ క్యాంపస్ పురవీధుల గుండా అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందన్నారు.

మురుగునీటి కాలువను శుభ్రం చేస్తున్న సర్పంచ్ లక్ష్మీప్రసన్న

మురుగు కాలువలు శుభ్రం

ప్రజాశక్తి-కలకడ

మండలములోని కదిరాయ చెరువు పంచాయతీలో కాలువలను సర్పంచ్ లక్ష్మి ప్రసన్న ఆధ్వర్యంలో శుభ్రం చేయించినట్లు తెలిపారు.ఈ పంచాయతీలో మురికి నీటి కాలువలు రోడ్డుకు ఇరువైపులా ఉండడం అందులో చెత్తాచెదారం పేరుకుపోవడం గమనించిన సర్పంచ్ పంచాయితీ సిబ్బందిచే శుభ్రం చేయించి నట్లు తెలిపారు.ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మన ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రతను పాటించ బడినప్పుడే రోగాల బారిన పడకుండా ఉంటామని తెలిపారు. పచ్చదనం, పరిశుభ్రతకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కమలనాథ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు రూరల్ పరిధిలోని వేపులబైలు సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పీలేరు ఎపిఎస్‌పిడిసిఎల్ డిప్యూటీ ఇఇ అమీర్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేపులబైలు సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతులు ఉన్న కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని వేపులబైలు, దొడ్డిపల్లి, బొడుమల్లువారి పల్లి పంచాయతీలకు సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అంతరాయాన్ని గుర్తించి తమతో సహకరించాలని కోరారు.

మరమ్మతులు జరగనున్న విద్యుత్ సబ్ స్టేషన్

క్రైం కార్నర్

విహారయాత్రలో విషాదం

-నీట మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పీలేరు

విహారయాత్రలో విషాదం చోటు చేసుకుంది.ఆహ్లాదకర వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కొంత సమయం సంతోషంగా గడపాలనుకున్నాడు. అందుకోసం చిత్తూరు జిల్లా విడిచి అన్నమయ్య జిల్లాలోని కెవి పల్లి మండలం, అడవిపల్లి రిజర్వాయర్ కు వచ్చాడు. అక్కడి నీటిని చూశాక కాస్త ఈత ఆడి సేద దీరాలన్న కోరిక అతనికి కలిగింది. అదే అతని పాలిట మృత్యువుగా మారనుందని ఊహించలేకపోయాడు పాపం. కెవిపల్లి పోలీ సుల కథనం మేరకు.. పులిచెర్ల మండలం, రెడ్డివారిపల్లి పంచాయతీ, తురక పేటకు చెందిన షఫీవుల్లా (44) ఆదివారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలసి కెవి పల్లి మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్ వద్దకు చేరుకున్నాడు. తమ యాత్రలో భాగంగా షఫీవుల్లా రిజర్వాయర్ నీటిలో దిగి ఈతాడడం ప్రారం భించాడు. ఆ సమయం నీటిలో అతనికి ఊపిరాడక మునిగిపోవడం గమనించిన కుటుంబ సభ్యులు జోరుగా కేకలు పెట్టడంతో అక్కడి స్థానికులు వచ్చి అతన్ని నీటిలోంచి ఒడ్డుకు తీసుకువచ్చారు. అతను మింగిన నీళ్లను కడుపు వత్తి బయ టకు తీసే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో స్థానికుల సాయంతో అతన్ని కుటుంబ సభ్యులు పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అతన్ని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారని కుటుంబ సభ్యులు చెప్పారు. ఈ మేరకు కెవి పల్లి ఎస్ఐ చిన్న రెడ్డప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతుడు షఫీవుల్లా పులిచెర్ల మండలం, రెడ్డివారిపల్లి వాటర్ షెడ్ చైర్మన్ గా ఇటీవలే నియమితులయ్యారు.

షఫీవుల్లా(ఫైల్ ఫొటో)

బైక్ ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బైక్ ఢీకొని రైతు తీవ్రంగా గాయపడినట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు. కురబలకోట మండలం, మట్లివారిపల్లెకు చెందిన రైతు వెంకటరమణారెడ్డి ఆదివారం సొంతపనిమీద ముదివేడుకు బైక్‌పై బయ లుదేరాడని తెలిపారు. మార్గమధ్యలో ముదివేడు టోల్ ప్లాజా వద్ద గుర్తు తెలి యని బైక్ రైతును ఢీకొని వెళ్లిపోయిందని తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతును టోల్ ప్లాజా సిబ్బంది అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్ప త్రికి తరలించినట్లు చెప్పారు. ఈఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడ్డ మరో రైతు..

గుర్తుతెలియని వాహనం ఢీకొని మరో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. పుంగ నూరు సిఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మండలంలోని ఈడిగపల్లి సమీ పం లోని దిగువ కొండమీదపల్లెకు చెందిన రైతు నక్కా వెంకటరమణ శనివారం రాత్రి తన వ్యవసాయ బోరువద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ సమీ పంలో గుర్తు తెలియని వాహనం రైతును ఢీకొట్టినట్లు తెలిపారు.అపస్మార కస్థితిలో రాత్రంత రోడ్డుపై పడిఉన్న రైతును ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారని అన్నారు. వారు క్షతగాత్రున్ని మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారని తెలిపారు. పరీక్షిం చిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరు పతికి రెఫర్ చేశారని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

బైపాస్‌లో రోడ్డు ప్రమాదం

-కారును ఢీకొన్న లారీ..ఆరుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె బైపాస్ రోడ్డులోని రాయల్ వుడ్ షో రూమ్ వద్ద ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా వారిలో ముగ్గురి పరిస్థితి ఆందోళ నకరంగా ఉంది. ఘటనకు సంబంధించి రెండవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డకు చెందిన ఇద్దరు, బెంగళూరుకు చెందిన ముగ్గురు, మద నపల్లికి చెందిన మరో వ్యక్తి మొత్తం ఆరుగురు కలిసి మదనపల్లె బసినికొండలోని ఓ కల్యాణ మండపంలో జరుగుతున్న వివాహానికి వెళ్లారని తెలిపారు. వివా హానంతరం కారులో బెంగళూరుకు బయలుదేరారని, మార్గమధ్యంలోని ముంబయి-చెన్నై జాతీయ రహదారి, రాయల్ వుడ్ షోరూం సమీపంలో టమాటో లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఆరుగురికి తీవ్రంగా గాయపడ్డారన్నారు. ప్రమాదాన్ని గమనించిన స్థాని కులు బాధితులను 108 లో మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటున్నారు. కాగా గాయపడ్డ వారిలో గీతేశ్ రెడ్డి, చంద్రశేఖర్, అనిల్ కుమార్, సోమశేఖర్, హఫీజ్, సాయికుమార్ ఉన్నారు. వీరిలో సాయికుమార్, హఫీజ్ సహా మిగిలిన వారంతా తీవ్రంగా గాయపడటంతో వారిని బెంగు ళూరుకు తరలించినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సిఐ రామచంద్ర తెలిపారు.

నుజ్జునుజ్జైన కారు